క్లుప్తంగా

పీహెచ్‌సీల్లో కాన్పులు సురక్షితం

పాన్‌గల్: పీహెచ్‌సీల్లోనే కాన్పులు సురక్షితమని డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారం తండాకు చెందిన పెంటమ్మ ఆడ శిశువుకు జన్మనిచ్చిందని తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. బాలింతకు కేసీఆర్ కిట్టు అందజేశామన్నారు. పీహెచ్‌సీలో కాన్పులు చేయించుకుంటే ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు పొందవచ్చని సూచించారు.

ముళ్ల పొదలు తొలగింపు

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి తూంకుంటకు వెళ్లే ప్రధాన రహదారిలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలను ఎస్‌ఐ రామన్‌గౌడ్ తన సొంత ఖర్చులతో జేసీబీ సాయంతో తొలగించారు. ఏపుగా పెరిగిన ముళ్లపొదల వల్ల ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ఆయన చెట్లను తొలగించడంతో పాటు రోడ్డుపై ఏర్పడిన గుంతలను సైతం పూడ్చించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చంద్రారెడ్డి, సిబ్బంది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

పాన్‌గల్: పంటలను ఆశించే తెగుళ్ల నివారణ కోసం రైతులు ఇష్టానుసారంగా మందులను పిచికారీ చేయకుండా అధికారుల సూచనలు పాటించాలని ఏఈఓ మహేశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని రేమద్దులలో వరి పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణ కోసం రైతులకు పలు సూచనలు చేశారు. వాతావరణ పరిస్థితుల మూలంగా వరి పంటను అగ్గి తెగుళ్లు, కాండం తొలుచు, కాండం కుళ్లు తెగుళ్లు ఆశించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆయా తెగుళ్ల నివారణకు వాడాల్సిన మందులను రైతులకు వివరించారు.

గోపాల్‌పేట: వరి సాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాలని, పంటలో ఏదైనా మార్పు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకొని మందులు పిచికారీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సమీరా అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని చెన్నూరు, గోపాల్‌పేట శివారు ప్రాంతాలతో పాటు బుద్దారం శివారులో వరి పంటలను పరిశీలించారు.

మహనీయుల ఆశయ సాధనే లక్ష్యం

వీపనగండ్ల: మహనీయులు కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం ఈ నెల 5 నుంచి 30వ తేదీ వరకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో సందేశ్ బైక్ యాత్రలను నిర్వహిస్తున్నట్లు కులవివక్ష పోరాట సమితి నాయకులు శరత్‌మురళి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహనీయుల విగ్రహాల ఎదుట చైతన్య యాత్రల వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగులు, వెంకటేశ్, రఘు, నవీన్, రాముడు, సహదేవుడు పాల్గొన్నారు.

శానిటేషన్ కిట్ల పంపిణీ

అమరచింత: ఆత్మకూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బందికి పట్టణానికి చెందిన గాండ్ల శివకుమార్ తన కుమార్తె సాన్విక పుట్టిన రోజు సందర్భంగా శానిటేషన్ కిట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈమేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ వార్డుల పరిశుభ్రతలో ముందుండి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు ఇలాంటివి అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బీఎస్‌కే రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ పాటించాలి

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకట్రామమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలించి ప్రహరీ ఎత్తును పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కంటి వెలుగు శిబిరం

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని 13, 14, 15 వార్డుల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుకేశిని, పొగాకు విశ్వేశ్వర్, కౌన్సిలర్ పద్మ, అయ్యన్న, జెయం. మిషేక్, గాడీల ప్రశాంత్, సుభాష్, శ్రీసుజీ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ఎంపీపీ గాయత్రి , ఎంపీడీఓ ప్రసన్నకుమారితో కలిసి శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం పంచాయతీ కార్యాలయంలో కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కాంతి, సర్పంచ్ మంజుల, సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, కార్యదర్శి లక్ష్మి, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

వీపనగండ్ల: సంపత్‌రావుపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రామేశ్వర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జ్ వైద్యులు రాజశేఖర్, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: మండలంలోని పెద్దమారులో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ సోమేశ్వరమ్మ, సర్పంచ్ గోవింద్ శ్రీధర్‌రెడ్డి, క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ హేమవర్ధన్‌లు ప్రారంభించారు.

‘సింగిల్‌విండో’ల అభివృద్ధికి కృషి

పాన్‌గల్: సింగిల్ విండో కార్యాలయం ద్వారా తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని డీసీసీబీ డైరెక్టర్, పాన్‌గల్ సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పాన్‌గల్ సింగిల్ విండో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాల సభ్యులైన రైతులకు ఆర్థిక భరోసా కల్పించడానికి డీసీసీబీలను నెలకొల్పినట్లు ఆయన వివరించారు. సింగిల్ విండోల ద్వారా రైతులకే కాకుండా చిరు వ్యాపారులు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, మహిళా పొదుపు సంఘాల సభ్యులకు, విద్యా, గృహ నిర్మాణాలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిచనున్నట్లు ఆయన తెలిపారు. స్వయం ఉపాధి కోసం అందిస్తున్న రుణాలను యువత సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో సింగిల్ విండోను మరింత అభివృద్ధి పథకంలో కొనసాగిస్తూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. సింగిల్ విండో ద్వారా రైతులతో పాటు అన్ని వర్గాలకు రుణాలను అందించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటునందించాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. రుణాల విషయంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ వారికి సూచించారు. సింగిల్ విండో జమ, ఖర్చుల ఆమోదం, అంచనా బడ్జెట్ వంటి అంశాలను చదివి వినిపించారు. సమావేశంలో విండో



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, సీఈఓ భాస్కర్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు హలీమ్‌పాష డైరెక్టర్లు, స్థానిక సర్పంచ్ గోపాల్‌రెడ్డి, శాగాపూర్ ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్, విండో సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో రైతులకు విత్తనాల సరఫరా

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని రేచింతల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రేచింతల పీఏసీఎస్ సహకార సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎండాకాలంలో తమ సొసైటీ పరిధిలో ఐదు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ ద్వారా రైతులకు సేవలు అందించడానికి నిరంతరం తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటేశ్వర్, వీరరాఘవపురం సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆరేపల్లి సర్పంచ్ అనసూయమ్మ యుగంధర్, డైరెక్టర్ దేవేంద్రం, రేచింతల ఎంపీటీసీ అలివేల బీసన్న, సీఈఓ రవి తదితరులు పాల్గొన్నారు.



రేచింతలలో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు

అమరచింత: గర్భిణులు, బాలింతలతో పాటు కిషోర బాలికలకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. అమరచింత మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం ఐసీడీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాలు, అక్షరభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాల్లో పాల్గొని మహిళలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి సీడీపీఓ భారతితో కలిసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మార్కెట్ వైస్ చైర్మన్ శ్రావణి, ఎంపీడీఓ జ్యోతి, కమిషనర్ మహమ్మద్ ఖాజా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీడీఓ కతలప్ప, ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మమ్మ మాట్లాడుతూ చిరుధాన్యాలు, మొలకెత్తిన విత్తనాలు తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. చిరుధాన్యాలు, పోషక విలువలతో కూడిన పదార్థాలను తీసుకుంటే మహిళలు, గర్భిణులు, కిషోర బాలికలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, హెచ్‌ఎంలు మంజుల, నాగేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, సువర్ణ, కమల, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో పోషకాహారం ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మొక్కలు సంరక్షించాలి

పాన్‌గల్: హరితహారంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీఓ కుర్మయ్య అన్నారు. శుక్రవారం చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మాందాపూర్, దొండాయిపల్లి గ్రామాలల్లో పర్యటించి మొక్కలకు నీరు పట్టి, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలని, ఎండిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటాలన్నారు. నర్సరీల్లో మొక్కలను ఎండ నుంచి కాపాడేందుకు నెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని సూచించారు.

పెబ్బేరు రూరల్: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ గాయత్రి అన్నారు. ఆమె శుక్రవారం శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, సర్పంచ్ మంజులతో కలసి ప్రధాన రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలకు నీటిని అందించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మొక్కల సంరక్షణ కోసం గ్రామ పంచాయతీల వాటరు ట్యాంకర్లు ఉన్నాయని, నిర్లక్ష్యం చేయకుండా మొక్కలకు నీటిని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.



కంభాళాపురంలో మొక్కలకు నీటిని అందిస్తున్న ఎంపీపీ గాయత్రి

నేడు కోదండరామస్వామి రథోత్సవం

గోపాల్‌పేట: స్థానిక కోదండ రామస్వామి ఆలయ ఆవరణలో రథోత్సవ కార్యక్రమాన్ని శనివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఏడు గంటల నుంచే ప్రత్యేక కార్యక్రమాలు, హోమాలు, కోలాటాలు, భజనలు, బొడ్డెమ్మలు ఉంటాయని అర్ధరాత్రి రథోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

స్వీపర్ల సేవలు మరువలేం

పెబ్బేరు: ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్ల సేవలను మరువలేమని మండల విద్యాధికారి జయరాములు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంతోపాటు మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న పదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సుమారుగా 50ఏళ్ల పాటు సేవలు అందించి, ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగడం చూశారని గుర్తుకు చేశారు. అలాగే పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న గోనేల ఎల్లయ్య, రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కృష్ణయ్యకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఎంపీడీఓకు వినతి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో సామూహిక మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని బహుజన సమాజ్ పార్టీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో శక్రవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కార్యదర్శి బహుజన రమేష్, ఎంపీటీసీ ఎల్లస్వామి, వార్డు సభ్యుడు చంద్రశేఖర్, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ



అజ్జకొల్లులో..



మాందాపూర్ ఉన్నత పాఠశాలలో..

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శ్రీ వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్రం, పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెంట్రీ బాక్సులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు గొల్ల వసంత శ్రీనివాసులు దంపతులు అందజేశారు. గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బుచ్చన్నగౌడ్ అనారోగ్యంతో బాధపడుతుండంతో ఆయనను పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సాయిబాబా దేవేందర్, కురుమూర్తి, కావలి రాజు, రవి, మంగలి భాస్కర్, వడ్ల పద్మ, చారి, బోయరాజు మంగలి శివశంకర్ పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను శుక్రవారం కౌన్సిలర్, సామాజిక కార్యకర్త అక్కమ్మ వితరణ చేశారు. కార్యక్రమంలో కస్తూర్బా ప్రత్యేకాధికారి పద్మారెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు వెంకటన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నియోజక వర్గ కన్వీనర్ శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ మండలంలోని 29 బూత్‌లకు పూర్తిస్థాయి బూత్ స్వశక్తి కిరణ్ అభియాన్‌లో భాగంగా కమిటీలు వేశామన్నారు. ఈ కమిటీలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం పథకాలు, నిధులు మంజూరును ప్రజలకు తెలియజేయాలని, ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రమాద బీమాపై వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేయడంలో విఫలమైందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బుడ్డన్న, రాఘవేందర్‌గౌడ్, వెంకటరామిరెడ్డి, భగవంతు యాదవ్, నాగరాజు యాదవ్, రఘు, దేవేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగాన్ని రక్షించుకుందాం



రేమద్దులలో నిరసన తెలుపుతున్న నాయకులు

పాన్‌గల్: రవాణా రంగాన్ని రక్షించుకునేందుకు అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలకిషన్ అన్నారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం రేమద్దులలో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రవాణా రంగా కార్మికుల వ్యతిరేక విధానాలు, ప్రజా రవాణ వాహనాల మీద, వాటికి వినియోగించే డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం నుంచి మినహాయింపు ఇవ్వాలని, టోల్ ట్యాక్స్ పెంపు ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా విధానాలతో ప్రజలపై అదనపు భారం పడుతూ నిత్యావసర సరుకుల ధరలపై ప్రభావం చూపుతుందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో నిర్వహించే సంఘర్ష ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, కాశయ్య, ప్రతాప్‌రెడ్డి, బాలకృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం టోల్ టాక్సీ పెంపు ప్రతిపాదన విరమించుకోవాలని ఆటో, తుఫాన్ డ్రైవర్లు శుక్రవారం ఎయిర్‌టీడబ్ల్యూఎఫ్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఊషన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా రవాణా వాహనాలకు డీజిల్, టోల్ టాక్సీ పెంపు ప్రతిపాదన విరమించుకోవాలని, ప్రజలపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఏప్రిల్ 5న చలో ఢిల్లీ సంఘర్ష ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామిగౌడ్, భీముడు, కాశన్న, ఎల్లస్వామి, రామకృష్ణ, రాములు, కర్ణాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘నాయకంటి’కి ఉత్తమ పురస్కారం



వనపర్తి: శ్రీరామనవమి సందర్భంగా గురువారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన త్యాగరాయగాన సభలో సీతారాముల వైభవంపై పట్టణానికి చెందిన నాయకంటి నరసింహశర్మ పద్యగానం చేశారు. అందరికీ అర్థమయ్యే రీతిలో గానం చదివి వినిపించడంతో ఆహుతుల నుంచి విశేషణ స్పందన రావడంతో ఈ మేరకు నాయకంటికి ఉత్తమ పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల్ చేతుల మీదుగా అందుకున్నారు.

అంతర్రాష్ట్ర భజన పోటీల్లో ప్రతిభ

పెబ్బేరు: మండలంలోని పెంచికలపాడులో అంతర్రాష్ట్ర భజన పోటీలను గురువారం సాయంత్రం 4 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో పాన్‌గల్ మండలంలోని రాయినిపల్లి మొదటి బహుమతి రూ. 25 వేలు, అనంతపురం జిల్లా శంకరాపురం రెండో బహుమతిగా రూ. 20 వేలు, గద్వాల జిల్లా ఐజ మండలం పర్దీపురం మూడో బహుమతి రూ. 15వేలు, గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని నక్కలపల్లి నాలుగో బహుమతిగా రూ. 12 వేలు, అనంతపురం జిల్లా కూచువారిపల్లి ఐదో బహుమతిగా రూ. 10 వేలు గెలుచుకున్నారు. వీరికి సర్పంచ్ గోవిందు నాయుడు, సత్యం, అశోక్ బ్రదర్స్, రాజు అగ్రో కెమికల్స్, శివకుమార్ శివ అగ్రో కెమికల్స్, రాధాకృష్ణ నాయుడులు నగదు ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు

చెత్త రహిత కొత్తకోటగా మారుద్దాం

కొత్తకోట: స్థానిక మున్సిపాలిటీని చెత్త రహిత పట్టణంగా మారుద్దామని కమిషనర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో శుక్రవారం చైర్‌పర్సన్ సుకేశిని, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆయన స్వచ్ఛ కొత్తకోటపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ అందించిన చెత్తబుట్టల ద్వారా ఆటోలో వేయాలని సూచించారు. ప్రతి నిత్యం వార్డులకు వచ్చే ఆటో సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రజలు పోగు చేసిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి ఎరువులను తయారు చేసి పంట పొలాలకు అందిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ రవీందర్, రెవెన్యూ అధికారి రమేష్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

పరీక్ష కేంద్రాల్లో వసతుల పరిశీలన



ఆత్మకూర్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ సుదర్శన్‌రావు

అమరచింత: పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణ కోసం అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని పరీక్షా కేంద్రాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఆత్మకూర్ మండల కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ డీఎస్ఓ సుదర్శన్‌రావు కేంద్రాల్లో వసతులపై ఆరాతీశారు. ఆత్మకూర్‌లో మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 780 మంది విద్యార్థులు, అమరచింతలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 296 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చాంద్‌పాషా, సింధూజ, ఎంపీడీఓలు జ్యోతి, వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

మదనాపురం: ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ నరేందర్ మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రమైన సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రం, ప్రిన్సిపాల్ రవీందర్, ఎంఈఓ కృష్ణయ్య ఉన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలో గల పదో తరగతి పరీక్ష కేంద్రాలు జెడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల శుక్రవారం తహసీల్దార్ సంధ్య, ఎంఈఓ జయశంకర్, ఎంపీడీఓ అఫ్జల్, పరీక్ష పర్యవేక్షకులు శాంతన్న, ఆర్ఐ తిరుపతయ్య పరిశీలించారు. మండలంలోని వెల్టూర్, మద్దిగట్ల, మోజర్ల, జగత్‌పల్లి, మనిగిళ్ల, కస్తూర్బాగాంధీ, సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో 423మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఫర్నీచర్, టాయిలెట్స్, తాగునీటి వసతి, ఫ్యాన్లు, వెలుతురు సరిగ్గా ఉన్నాయా లేదా అని పర్యవేక్షించారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి

వీపనగండ్ల: విద్యార్థులు చదువులో అత్యున్నత ప్రతిభ కనబరిచి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. మండలంలోని కల్వరాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో చిన్నంబావి ఎంపీపీ సోమేశ్వరమ్మ స్థాపించిన గణేశ్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా అందజేసిన పరీక్షా సామగ్రిని సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుర్మయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు భాస్కర్, రాజు, కృష్ణవేణి, చంద్రశేఖర్, శివుడు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు, 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కురుమయ్య మాట్లాడుతూ రాబోయే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో అందరూ ఉత్తీర్ణులు కావాలన్నారు. అనంతరం విద్యార్థుల ఆట పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



శ్రీరంగాపురంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం కురుమయ్య


ఖిల్లాఘనపురం: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కన్న తల్లిదండ్రులకు, గురువులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని అప్పారెడ్డిపల్లి సర్పంచ్ కృష్ణవేణి, హెచ్ఎంలు సూర్యసంజీవ్, నవీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు వివిధ కేటగిరీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, హాల్‌టికెట్లు, పెన్నులు, స్కేలు తదతర వాటిని అందజేశారు. కార్యక్రమంలో శంకర్‌గౌడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీని గద్దె దింపాలి

వనపర్తి టౌన్: ప్రధాని మోదీని గద్దెదింపి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనర్హత పేరుతో రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసి, రెండేళ్ల జైలుశిక్ష విధిస్తారా అని నిప్పులు చెరిగారు. బీజేపీ ఎమ్మెల్యేలు చెప్పలేని తప్పులు చేశారని.. వారిపై చర్యలు ఉండవా అని ప్రశ్నించారు. ప్రజలకు ఎప్పటికై నా ప్రశ్నించే, పోరాడే నాయకులు కావాలని.. అలాంటి నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. సమావేశంలో జిల్లా సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ దేవన్నయాదవ్, అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వెంకటేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్, దిలీప్ యాదవ్, అనిల్‌కుమార్, నర్సింహ పాల్గొన్నారు.

తాటిపాములలో బండలాగుడు పోటీలు

పెబ్బేరు రూరల్: శ్రీరామ నవమి పురస్కరించుకొని శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో పంచాయతీ, ఆలయ కమిటీ సంయుక్తంగా అంతరాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ సత్యంయాదవ్, ఎంపీటీసీ పార్వతమ్మతో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఏడు జతల ఎద్దులు పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి టౌన్ లంకిరెడ్డి నిక్షేత్‌రెడ్డి ఎద్దులు 3,369.8 ఫీట్లు లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.50 వేలు గెలుపొందారు. జోగులాంబ గద్వాల జిల్లా పెదొడ్డికి చెందిన పైకం లక్ష్మీనారాయణ ఎద్దులు 3వేల ఫీట్లు లాగి రెండో స్థానంలో నిలిచి రూ.40 వేలు గెలుపొందారు. అనంతపురం జిల్లా కృష్ణాపురం గ్రామానికి చెందిన నాగరాజుగౌడ్, లక్ష్మీరెడ్డి ఎద్దులు 2,500 ఫీట్లు లాగి మూడో స్థానంలో నిలిచి రూ.30 వేలు గెలుపొందారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దులు 2,459.4 ఫీట్లు లాగి నాల్గో స్థానంలో నిలిచి రూ.20 వేలు, జోగులాంబ గద్వాల జిల్లా మానపాడుకు చెందిన రవీందర్‌రెడ్డి, వనపర్తి గోసాయి దీనస్ రాయుడు ఎద్దులు 2,384.4 ఫీట్లు లాగి అయిదో స్థానంలో నిలిచి రూ.10 వేలు గెలుపొందారు. వనపర్తి జిల్లా గుమ్మడం గ్రామానికి చెందిన పరశురాముడు ఆరో స్థానంలో నిలిచి రూ. 5వేలు దక్కించుకున్నారు. విజేతలకు సర్పంచ్ సత్యంయాదవ్, ఎంపీటీసీ పార్వతమ్మ, బహుమతుల దాత నీలంగౌడు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ మందాడి చిదంబర్‌రెడ్డి, గోసాయి హరిప్రసాద్, యాంకర్ రహిమాన్‌భాషా, దాసరి కృష్ణ , లింగాల రేవంత్, వెంకటయ్యనాయుడు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న వాసంతి

తాగిన మైకంలో వ్యక్తిపై దాడి

గోపాల్‌పేట: తాగిన మత్తులో ఒకరిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల మేరకు.. బుద్దారం గ్రామానికి చెందిన కొంకలిశేఖర్, అదే గ్రామానికి చెందిన బాల్‌రాజుకు డబ్బుల విషయంలో గొడవ ఉంది. శుక్రవారం బాల్‌రాజు తాగిన మైకంలో కొంకలి శేఖర్‌పై పారతో దాడిచేశాడు. దీంతో కొంకలి శేఖర్ గాయాలపాలయ్యాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.